క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మెటీరియల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరు వరుసరాముడు తెలిపారు. జగనన్న కాలనీలో ఇంటికి వాడుతున్న 'రా మెటీరియల్‌ను' శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇసుక, కంకర, ఇనుము నాణ్యతను పరిశీలించిన ఇంజినీర్ గోడల నిర్మాణంలో క్యూరింగ్‌పై ఆరా తీశారు. టెస్టింగ్ కోసం మెటీరియల్‌ను సేకరించారు. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ రవి కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని కునిమహాల్‌లోని హోటల్‌లో టీ తాగేందుకు వెళ్లిన వృద్ధుడిపై ఓ వ్యక్తి శుక్రవారం దాడి చేశారు. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు నబీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కునిమహాల్‌లోని ఓ హోటల్ నందు టీ తాగేందుకు వెళితే అక్కడ గౌస్ అనే వ్యక్తి మద్యం మత్తులో తనపై కామెడీ చేశారనానరు. నీ వయసెంత, నా వయసెంత అన్నందుకు నాపై జగ్గుతో తలపై కొట్టాడని చెప్పారు.

చేసే పనిలో నిర్లక్ష్యం వహించవద్దు



అధికారులతో మాట్లాడుతున్న మనోజ్ నాగరాజు

ఆదోని సెంట్రల్: మనం చేసే పనిలో నిర్లక్ష్యం వహించ కూడదని సీనియర్ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్ నాగరాజు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆదోని, గుంతకల్ అధికారులతో సేఫ్టీ సెమినార్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన ప్రయాణికుల భద్రతతో పాటు రైల్వే ఆస్తుల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఆదోని రైల్వే స్టేషన్‌లో రూ. 9 కోట్లతో చేపడుతున్న పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జీఎం. బాషా, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఎస్ఎస్ఈ వర్క్స్ నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలే భవిష్యత్‌కు పునాదులు



అంగన్‌వాడీ సెంటర్లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: అంగన్‌వాడీ కేంద్రాలు విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులని, నర్సరీ విద్య కీలకమని ఎంపీడీఓ సుబ్బరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలో కామవరం గ్రామంలో ఉన్న నాల్గవ అంగన్‌వాడీ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పిల్లలు ఎంత మంది రావాలి... ఎంత మంది వచ్చారు.. అని టీచర్ రాధను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు చక్కగా నేర్పించాలని, మెనూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

ఆదోనిరూరల్ : కర్ణాటక మద్యాన్ని శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న మండలంలోని తోవి గ్రామానికి చెందిన బోయ పాండవగల్లు ఉసేనిని జి.హొసళ్లి గ్రామశివారులో అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సీఐ నిరంజన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. 1152 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (90ఎం.ఎల్ పరిమాణం), ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కర్ణాటక మద్యం తరలించే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఐ హెచ్చరించారు. దాడుల్లో పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, పోలీసు సిబ్బంది లక్ష్మీనారాయణ, వెంకటేష్‌నాయక్

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఆదోనిటౌన్ : ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. పట్టణంలోని 41వ వార్డు హనుమాన్‌నగర్‌లో నీలకంఠేశ్వరస్వామి కల్యాణమండపం, 34వ వార్డు టీబీఎల్ కాలనీ, పాండురంగస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం అధికారులు, డాక్టర్లు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లు నిర్వహించారు. వైద్యనిపుణులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రెండు వైద్య శిబిరాల్లో దాదాపు 1,500 మంది వైద్య సేవలు పొందారని డాక్టర్లు తెలిపారు. 120 మందికి కంటి పరీక్షలు, 10 మందికి ఈసీజీ పరీక్షలు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. హెల్త్ క్యాంప్‌లను వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ మధుసూదన్ సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రోగులతోనూ ఎమ్మెల్సీ మాట్లాడారు. డాక్టర్లు వైద్య పరీక్షలు బాగా చేస్తున్నారా... మందులు ఉచితంగానే అందజేశారా అని ఆరా తీశారు. డాక్టర్లు ఓపిగ్గా పరీక్షలు చేశారని, మందులు కూడా ఉచితంగా అందజేశారని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏ ఒక్కరూ అనారోగ్యంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా భావిస్తూ సీఎం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. వైద్యనిపుణులు ఉచిత వైద్య పరీక్షలతోపాటు మందులు అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, నర్సింగ్ విద్యార్థులు, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

జగనన్న ఆరోగ్య సురక్ష

ఆదోనిరూరల్ : ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న జగనన్న ఆరోగ్య వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ సరోజమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు ఇమ్రాన్‌అహ్మద్, నిస్సీగ్రేస్, మయూర్‌కుమార్ 400 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను డిప్యూటీ తహసీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలక జయరాముడు, హనుమంతు, అంగన్‌వాడీ వర్కర్లు కాంతి, ఆశావర్కర్లు ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.



శిబిరంలో బీపీ పరీక్షలు చేస్తున్న దృశ్యం

20ఎంఎల్ఎం113సీ- రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణ కల్పిస్తుందని కుంటనహాల్ గ్రామ సర్పంచ్ పార్వతమ్మ, గ్రామ ఇన్‌చార్జ్ శివరాం అన్నారు. మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వైద్యనిపుణులు 223మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇద్దరిని కర్నూలు ఆసుపత్రికి వైద్యులు రెఫర్ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారాజు, డాక్టర్ ఇమ్మాన్యుయల్, శిరిష,సుజాత, సరిత,కార్యదర్శి నగేష్,ఎంపీటీసీ నాగమ్మ, నాయకులు సిద్దప్ప, రాజసాబ్, వీరయ్యస్వామి, సద్దరామగౌడ్, లింగన్న, ఈరన్న, ఆశవర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చింతకుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం డాక్టర్ మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వినోద్ నాయక్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు ఈరన్న ప్రారంభించారు. 398 మంది రోగులకు వివిధ రకాలుగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అభిరూప్, డాక్టర్ రజిత, డాక్టర్ తరుణ్, డాక్టర్ రామచంద్ర ఎంపీహెచ్ఈఓ ఎల్లప్ప, శ్రీనివాసులు, సూపర్ వైజర్ రాముడు, ఏఎన్ఎమ్‌ను శీలమ్మ, ఆశావర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గ్రామానికి వైద్యులు రావడం సంతోషంగా ఉంది



పేదలకు వైద్యం అందించాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఏర్పాటు చేసి డాక్టర్లు గ్రామానికి పంపించి వైద్య సేవలు అందించడం చాల సంతోషంగా ఉంది. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేయించుకున్నా. మరలా క్యాంప్‌లో పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు.

– ఎర్రదొడ్డి లక్ష్మయ్య, చింతకుంట

డాక్టర్ల సేవలు బాగున్నాయి



డాక్టర్ల సేవలు బాగున్నాయి. నేను కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నా. నరాలు, నడుములు నొప్పులు ఉన్నాయని డాక్టర్లు చెప్పారు. బీపీ చెక్ చేసి ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. గ్రామానికి డాక్టర్లు వచ్చి వైద్య సేవలు అందించడం సంతోషకరంగా ఉంది. ఇలాంటి వైద్య శిబిరాలు అప్పుడప్పుడు నిర్వహిస్తే బాగుంటుంది.

– గొట్టమ్మ, చింతకుంట



మందులు అందజేస్తున్న దృశ్యం

ఆర్మీ అగ్నిపత్‌కు 12 మంది ఎంపిక

మంత్రాలయం : మంత్రాలయంలో విజేత గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 12 మంది ఆర్మీ అగ్నిపత్‌కు ఎంపికయ్యారు. పీఈటీ మల్లికార్జున వీరికి శిక్షణ ఇచ్చారు. ఇందులో నలుగురు అభ్యర్థులు స్పోర్ట్స్ కోటా ఎంపిక కాగా, మరో 8మంది నేరుగా ఎంపికయ్యారు. హలహర్వి గ్రామానికి చెందిన మహేంద్ర నాయుడు, పి. శివప్రసాద్, కె.మహబూబ్ బాషా(బసాపురం), సురేష్ నాయక్(ఎం.తాండ), జి.శివ(ఎర్రబాడు), ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేష్, రాంబాబు, బాలు, వెంకటాపురంకు చెందిన బి.రఘు రెడ్డి, కె. రఘువీర్, కలుగొట్లకు బి.నరసింహలు ఎంపికయ్యారు. వీరు మర్యాదపూర్వకంగా విజేత గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డిని కలిశారు. అభ్యర్థులతో పాటు శిక్షణ ఇచ్చిన కోచ్ మల్లికార్జునలను ప్రదీప్ రెడ్డి అభినందించారు.



అగ్నిపత్‌కు ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న వీజీఎస్ఏ గౌరవ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి

ఎస్ఎస్ ట్యాంకులోని మొసలి పట్టివేత

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం బసాపురం గ్రామం ఎస్ఎస్ ట్యాంకులో ఉన్న మొసలి ఎట్టకేలకు పట్టు బడింది. శుక్రవారం వైల్డ్‌లైఫ్ రిస్క్యూ టీమ్ నీటిలోకి బోటు ద్వారా దిగి మొసలి కోసం గాలించగా వలలో పడింది. ప్రజలు దాహార్తి తీర్చడానికి నిర్మించిన ఎస్ఎస్‌ట్యాంకులో మొసలి ఉన్నట్లు గ్రామస్తులు, సిబ్బంది అధికారులకు విన్నవించారు. ఏడాది నుంచి పట్టు కోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలించలేదు. ట్యాంకు దగ్గరకు వెళ్లాలి అంటే ప్రజలు భయపడేవారు. ఎట్టకేలకు జాలర్లు ద్వారా మొసలి పట్టు కోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు. మొసలిని మునిసిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఫారెస్టు అధికారులకు అప్పటించారు. ఫారెస్టు రేంజ్ అధికారి తేజశ్విని సూచనల మేరకు సెక్షన్ అధికారి మణిధర్ నాయుడు, బీట్ ఆఫీసర్స్ వెంకటేశ్వర్లు, సమీ ఉల్లా రిస్క్యూ టీమ్‌తో కలసి నీటి సాంద్రత ఎక్కువగా ఉండి ప్రజల సంచారం లేని ప్రాంతంలో వదలి వచ్చారు. ఇంకా ఎస్ఎస్ ట్యాంకులో రెండు చిన్న మొసళ్లు ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పట్టుకుంటామని పురపాలక కమిషనర్ తెలిపారు.



ఫారెస్టు అధికారులకు అప్పగించిన మొసలి

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఆదోని సెంట్రల్: సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని యూటీఎఫ్ సీనియర్ నాయకులు పాపయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని విజయభాస్కర్ రెడ్డి సర్కిల్‌లో నిరహార దీక్షలు చేపట్టారు. ఎస్టీయూ నాయకులు నాగరాజు, నరసింహులు, సుంకన్న, రవికుమార్, సీపీఎం కార్యవర్గ సభ్యులు గోపాల్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు దీక్షకు సంఘీభావం తెలిపారు.

కౌలు రైతులకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలి

కోసిగి: కౌలు రైతులకు బ్యాంక్ పంట రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు గోపాల్ కోరారు. శుక్రవారం మండలంలోని ఆర్లబండ సహకార సంఘం కార్యాలయంలో అసిస్టెంట్ హరినాథ్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓంకార్ స్వామి, నరసింహులు, కరునాకర్, వీరేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

కౌతాళం : అర్హతే ప్రామాణికంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కామవరం గ్రామంలో యువజన నాయకుడు మహేందర్‌రెడ్డి, కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు వీరసేనరెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిన తీరు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని పాదయాత్రలు చేపట్టినా ప్రజలు టీడీపీని నమ్మే స్థితిలో లేరన్నారు. తప్పు చేసినందునే చంద్రబాబును అధికారులు జైల్లో పెట్టారన్నారు. 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరేష్, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ వసంత, స్థానిక నాయకులు, ఎంపీడీఓ సుబ్బారాజు, మండల వ్యవసాయాధికారి శేషాద్రి, ఆర్ఐ రాజశేఖర్, కార్యదర్శి శివప్ప, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గ్రామస్తులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

కోసిగిలో చోరీ

కోసిగి:మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాళెం కాలనీలో సూగూరేశ్వర దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఆర్ఎంపీ వైద్యుడు ప్రభాకర్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఆరోగ్యం సరిగ్గా లేక పోవడంతో సోదరుడు ఇంట్లో రాత్రి ఉండిపోయాడు. వేకువ జామున ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగిలి ఉంది. ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించి ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న రూ10వేల నగదు, 4 తులాల బంగారు అపహరించికెళ్లినట్లు బాధితుడు వాపోయాడు.

వాహనాల తనిఖీ

మంత్రాలయం : మండల కేంద్రం మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో వాహనాలను ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి మంత్రాలయం మీదుగా వచ్చే వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

హిందూ శ్మశానవాటిక పరిశుభ్రం


ఆదోనిటౌన్ : ఆదోని హిందూ శ్మశానవాటికకు మంచిరోజులు వచ్చాయి. కొంతకాలంగా శ్మశాన వాటికలో ముళ్లకంపలు, చెట్లు, చెదారం పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉంది. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి స్థానిక ప్రజలు, వీహెచ్‌పీ నాయకుల విన్నపం మేరకు శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్‌పర్సన్ బోయ శాంత, వీహెచ్‌పీ నాయకులు నాగరాజుగౌడ్, బసవన్నగౌడ్, చెన్నబసప్ప, కునిగిరి నీలకంఠ, జైపాల్, కౌన్సిలర్‌లు రఘునాథ్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి శ్మశాన వాటికను సందర్శించారు. వాటికలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్లపొదలను పరిశీలించారు. ఒక్కసారిగా మున్సిపల్ శానిటరీ వర్కర్లు 150 మందితో శుభ్రం చేయించారు. ముళ్లపొదలు, చెట్లను తొలగించారు. త్వరలోనే రోడ్లు ఏర్పాటు చేస్తామని, శ్మశానానికి అమావాస్య రోజున వెళ్లి పూజలు చేసేవారికి, ఎవరైనా చనిపోతే దహనం చేసి వచ్చి వారికోసం సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. శ్మశానాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని, ప్రజలు కూడా సహకరించాలన్నారు. ప్రధానంగా గేట్లు ఏర్పాటు చేస్తామన్నారు.



వీహెచ్‌పీ సామాజిక సేవా కార్యకర్తలతో చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్‌పర్సన్ బోయ శాంత



శ్మశాన వాటికలో శుభ్రం చేస్తున్న శానిటరీ వర్కర్లు











గవ్వల అలంకారంలో దర్శనమిస్తున్న లక్ష్మమ్మవ్వ | ధనలక్ష్మి అలంకారంలో కొలువైన మహంకాళిదేవి | సరస్వతిగా దర్శనమిచ్చిన మాతా పరమేశ్వరిదేవి | ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి | సరస్వతి అలంకారంలో అమ్మవారు

సరస్వతీ నమస్తుభ్యం

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు 6వ రోజు శుక్రవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున ఆలయ, మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలో ఆయా దేవతల రూపంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతేగాకుండా ఆలయాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిగీతాలపన చేపట్టారు.

కౌతాళం: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలాయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. మండల కేంద్రం కౌతాళంలో వెలిసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఈరన్న కట్టవద్ద ఉన్న మహంకాళీ దేవి దేవాలయం, శివారులో వెలసిన ఆదిబసవేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాత్యాయని దేవిగాఅమ్మవారు

కాత్యాయని దేవి అలంకరణలో శాంభవి దేవి

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు కాత్యాయని దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ గావించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘోర రోడ్డు ప్రమాదం

- పాలవ్యాన్‌తోపాటు బైక్‌ను ఢీకొట్టిన బొలెరో
- నలుగురికి గాయాలు

ఆదోనిఅర్బన్ : పట్టణశివారు ఎమ్మిగనూరు రోడ్డులో శుక్రవారం పాల వ్యాన్‌తోపాటు బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులకు బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదోనికి నరసారావుపేట నుంచి బొలెరోలో డ్రైవర్ సింహాద్రి, వాహనం ఓనర్ రవితేజ వస్తున్నారు. ఈ క్రమంలో ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు పాలవ్యాన్‌లో స్థానిక అమరావతినగర్‌కు చెందిన చరణ్ వెళ్తున్నాడు. ఎమ్మిగనూరు రోడ్డులో పాలవ్యాన్‌ను ఢీకొట్టిన బొలెరో డ్రైవర్ ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు బైక్‌పై వెళ్తున్న సిరాలదొడ్డి గ్రామానికి చెందిన వీరారెడ్డిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పాల వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సింహాద్రి, రవితేజ, చరణ్, వీరారెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలియజేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరారెడ్డి



బొలెరో వాహనం ఢీకొట్టడంతో బోల్తాపడిన పాల వ్యాన్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం షెడ్యూల్

ఆదోని సెంట్రల్: ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మారుమూల గ్రామాల్లో సైతం వైద్యనిపుణులు ఉచితంగా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు కూడా అందజేస్తుండడంతో హెల్త్ క్యాంప్‌లు కిటకిటలాడుతున్నాయి. శనివారం ఆదోని, మంత్రాలయం నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ షెడ్యూల్‌ను అధికారులు శుక్రవారం విడుదల చేశారు.

మండలం	గ్రామం	స్థలం
ఆదోని పట్టణం	శంకర్ నగర్ హవ్వన్నపేట	క్రాంతి నగర్ హవ్వన్న పేట
ఆదోని	గణేకల్లు	గ్రామ సచివాలయం
కౌతాళం	ఉప్పరాల్	గ్రామ సచివాలయం
కోసిగి	ఆర్లబండ	గ్రామ సచివాలయం
పెద్దకడుబూరు	కంబదహాల్	ఆంజనేయస్వామి టెంపుల్